సాక్షి
జోగుళాంబ గద్వాల
బుధవారం । 22 । నవంబర్ । 2023



కురుమూర్తి.. భక్త ఝరి
అమ్మాపురం కురుమూర్తిస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 12లో ▸



ప్రసాదంతో లక్ష్మీకటాక్షం
జోగుళాంబ సన్నిధిలో ప్రసాద విక్రయాలు ఆలయానికి లక్ష్మీకటాక్షంగా మారాయి.

వివరాలు 12లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.8 /22.4

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. రాత్రి చలి తీవ్రత కాస్త ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు అయిజలో ఖర్గే ఎన్నికల ప్రచారం
అయిజ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. అయిజలో మధ్యాహ్నం 12.30కు నిర్వహించే ప్రజా గర్జన సభకు ఆయనతోపాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్, విజయశాంతి హాజరుకానున్నారు. ఇదిలాఉండగా, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మంగళవారం సభ ఏర్పాట్లతోపాటు హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఆయనతోపాటు సీఐ శివశంకర్‌గౌడ్, ఎస్ఐ నరేష్‌కుమార్ ఉన్నారు.

తాహెర్‌కు జీవన సాఫల్య అవార్డు


అయిజ: జిల్లాలో బ్లడ్ క్యాంక్‌ల నిర్వహణలో చురుకైన పాత్ర పోషించినందుకు అయిజకి చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ తాహెర్‌కు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవన సాఫల్య అవార్డు దక్కింది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో ఎస్వీ ఫంక్షన్ హాల్లో సోమవారం రాత్రి రాజ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబ్దుల్ కలాం జయంతి వేడుకల్లో ఏపీ మహిళా కమిషన్ మెంబర్ విజయమనోహరి చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తాహెర్ మాట్లాడుతూ.. పురస్కారం తనలో బాధ్యతను మరింతగా పెంచిందని, భవిష్యత్తులో మరింత చురుకుగా బ్లడ్ క్యాంపుల నిర్వహణలో పాల్గొంటానని అన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ రత్నకుమారి, రాజ్‌కుమార్ ఫౌండేషన్ డైరెక్టర్ జయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పరీక్షలు ప్రారంభం


మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ 8వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పరీక్షలను రిజిస్ట్రార్ గిరిజ పరిశీలించారు. ఆన్సర్ బుక్‌లెట్‌పై సబ్జెక్టు, హాల్‌టికెట్, కోడ్ తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు. ఆమె వెంట సూపరింటెండెంట్ చంద్రకిరణ్, పరీక్షల నియంత్రణ అదనపు అధికారి శాంతిప్రియ తదితరులున్నారు.

సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడి


తెలకపల్లి: సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. శశిభూషణ్, డా. శంకర్, శ్రీధర్, అర్చన సూచించారు. మంగళవారం మండలంలోని దత్తత గ్రామమైన బొప్పల్లిలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోత్స్న ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు రైతులు సాగుచేసిన మిరప, వేరుశనగ, మొక్కజొన్న, కంది, మినుము పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొక్కజొన్నకు కత్తెర పురుగు, మినుముకు లద్దె పురుగు, పచ్చపురుగు, మిరపలో పైముడత ఉధృతి ఉందని గుర్తించారు. ఆయా పంటలకు పిచికారీ చేయాల్సిన పురుగు మందులను వివరించారు. కార్యక్రమంలో గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాగేంద్రస్వామి హాజరై ప్రసంగించారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ పద్మావతి, బాలయ్య, రమేష్‌చంద్ర, ఎన్ఎస్ఎస్ వలంటీర్స్, అధ్యాపకులు రాఘవేంద్రరెడ్డి, నిరంజన్‌గౌడ్, ఖదర్‌వలీ పాల్గొన్నారు.

స్వతంత్రులు.. తగ్గేదేలే!
అలంపూర్ అసెంబ్లీ పోరులో ప్రధాన పార్టీలకు సవాల్



- 1952 నుంచి 78 వరకు స్వతంత్రుల హవా
- 2004లో స్వతంత్ర అభ్యర్థిని వరించిన విజయం
- ఎనిమిది సాధారణ ఎన్నికల్లో బరిలో నిలిచిన వైనం
- గెలుపోటములపై ప్రభావం

అలంపూర్ బరిలో నిలిచిన స్వతంత్రుల వివరాలిలా..

ఏడాది	స్వతంత్ర అభ్యర్థి	ఫలితం
1952	జమ్మన్న	ఓటమి
1953	జమ్మన్న	ఓటమి
1957	జనార్దన్‌రెడ్డి	ఓటమి
1962	పాగపుల్లారెడ్డి	ఓటమి
1967	జనార్దన్‌రెడ్డి	ఓటమి
1972	శ్రీరామరెడ్డి	ఓటమి
1978	రజనీబాబు	ఓటమి
2004	చల్లా వెంకట్రామిరెడ్డి	గెలుపు

అలంపూర్: జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలతోపాటు స్వతంత్రంగా సైతం చట్టసభలకు వెళ్లడానికి రాజ్యాంగం అవకాశం కల్పించగా.. ఆ అవకాశాన్ని ఆయుధంగా మార్చుకొని అనేకమంది స్వతంత్రులు పోటీకి సై అంటున్నారు. ప్రధానంగా అలంపూర్ నియోజకవర్గంలో జాతీయ, రాష్ట్రీయ పార్టీలతోపాటు స్వతంత్రులు పోటీలో నిలిచారు. చాలావరకు వారు ఓటమి చవిచూసినప్పటికీ.. ప్రధాన పార్టీల అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టించారు. నియోజకవర్గంలో 17 సార్లు జరిగిన ఎన్నికల్లో ఒక స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించినప్పటికీ దాదాపు ఏడు సార్లు ప్రధాన పార్టీ అభ్యర్థులకు చుక్కలు చూపించారు. గెలుపు నీదా.. నాదా అన్నట్లుగా కౌంటింగ్ సాగింది. మొత్తానికి అలంపూర్ నియోజకవర్గంలో స్వతంత్రులుగా పోటీ చేసిన చాలామంది తమ ప్రత్యేకతను చాటారు.



అలంపూర్‌లో నామినేషన్ ఉపహంరించుకుంటున్న స్వతంత్ర అభ్యర్థి (ఫైల్)

1952 నుంచే స్వతంత్రుల హవా..
అలంపూర్ శాసనసభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులతోపాటు స్వతంత్రులు సైతం పోటీకి సై అన్నారు. కొందరు వారి ప్రభావం చూపగా.. మరికొందరు డిపాజిట్ కూడా దక్కించుకోలేదు. కేవలం ఒక వ్యక్తిగా నిలిచి శక్తిగా ప్రభంజనం సృష్టించడం ప్రజల మన్ననలు పొందడం స్వతంత్రలకు కత్తిమీద సాములాంటింది. 1952లో తొలిసారి అలంపూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. తొలినాళ్లలోనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన కలవండ్ల డాక్టర్ నాగన్న పోటీ చేయగా ప్రత్యర్థిగా జమ్మన్న స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో జమ్మన్న స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. కానీ రెండవ స్థానంలో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఏడాదిలోనే అనగా 1953లోనే రెండవ సారి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ నాగన్న, ప్రత్యర్థిగా స్వతంత్ర అభ్యర్థి జమ్మన్న పోటీపడ్డారు. అప్పటి పరిస్థితుల్లో జమ్మన్న రెండవ స్థానం దక్కించుకున్నారు. 1957లో జనరల్ స్థానంగా మారగా.. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జయలక్ష్మిదేవమ్మ, స్వతంత్ర అభ్యర్థిగా జనార్దన్‌రెడ్డి పోటీ చేశారు. జయలక్ష్మిదేవమ్మకు 13,345 ఓట్లు.. స్వతంత్ర అభ్యర్థి జనార్దన్‌రెడ్డికి 13,267 పోల్ కాగా.. కేవలం 78 ఓట్ల తేడాతో స్వతంత్ర అభ్యర్థి ఓటమి చెందారు. దీనిని బట్టి ఎంతటి గట్టి పోటీ ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. 1962లో కాంగ్రెస్ అభ్యర్థి మురళీధర్‌రెడ్డికి 20,715, స్వతంత్ర అభ్యర్థి పాగపుల్లారెడ్డి 20,548 ఓట్లు వచ్చాయి. 167 ఓట్ల తేడాతో పాగపుల్లారెడ్డి ఓటమి చవి చూశారు.

ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ..
అలంపూర్‌లో దాదాపు స్వతంత్రులు 52 ఏళ్లపాటు పోరాటం చేస్తే ఒక్కసారి విజయం వరించింది. ఒక విజయానికి స్వతంత్రులు 52 ఏళ్లపాటు నిరీక్షించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 1978 నుంచి ఇప్పటి వరకు స్వతంత్రలు ప్రభావం చూపలేకపోయారు. ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్రులు బరిలో ఉంటున్నారు. కానీ గతంలో చూపిన విధంగా ప్రభావం చూపలేకపోతున్నారు. తాజా ఎన్నికల్లో బరిలో వివిధ పార్టీలకు చెందిన ఎనిమిది మంది, ఐదుగురు స్వతంత్రులు ఉన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల బరిలో 14 మంది అభ్యర్థులకు ఆయా పార్టీల నుంచి ఎనిమిది మంది, స్వతంత్రులు ఆరుగురు ఉన్నారు. 2014లో 11 మందికిగాను ప్రధాన పార్టీలకు చెందిన వారు ఆరుగురు, స్వతంత్రులు ఐదుగురు ఉన్నారు.

2004లో చల్లాను వరించిన విజయం
1967లో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డికి 35,780 ఓట్లు రాగా స్వతంత్ర అభ్యర్థి జనార్థన్‌రెడ్డికి కేవలం 4330 ఓట్లు వచ్చాయి. 1972లో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డికి 37,438 ఓట్లు రాగా, స్వతంత్ర అభ్యర్థి శ్రీరామరెడ్డికి 15,268 ఓట్లు పోలయ్యాయి. 1978లో జనతా పార్టీ అభ్యర్థి చల్లా రాంభూపాల్ రెడ్డికి 23,998 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి రజనిబాబుకు 23,873 ఓట్లు రాగా 125 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2004లో టీడీపీ అభ్యర్థిగా వావిలాల సునిత స్వతంత్ర అభ్యర్థిగా చల్లా వెంకట్రామిరెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి 33,252 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి చల్లా వెంకట్రామిరెడ్డికి 37,499 ఓట్లు పోలవ్వగా.. చల్లా వెంకట్రామిరెడ్డిని 4,247 ఓట్లతో విజయం వరించింది.

ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు
గద్వాల రూరల్: ప్రజాస్వామ్యం, రాజకీయాల్లో హింసకు తావులేదని, కాంగ్రెస్ పార్టీ నాయకుల బెదిరింపు, రెచ్చగొట్టే మాటలకు స్థానికులైన గద్వాల ప్రజలు ఎవరూ కూడా బెదిరిపోవద్దని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను 30ఏళ్ల నుంచి గద్వాలలో ప్రత్యక్ష రాజకీయాలు చూస్తున్నానని గతంలో ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేసిన నాయకులు ఎవరూ కూడా తొక్కుతాం, పాతాళానికి అణచేస్తాం.. అనే బెదిరింపు ధోరణిలో ప్రసంగాలు చేయలేదని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు కొత్త భాషను వాడుతున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. ఎన్నికలలో పోటీచేసే హక్కు అందరికీ ఉంటుందని, చివరికి ప్రజల తీర్పే అంతిమమని, అంతేకాని బెదిరించి ఓట్లేయింకుంటామంటే అది గద్వాలలో సాధ్యపడదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల బెదిరింపు ధోరణి, రెచ్చగొట్టే ప్రసంగాలకు ఎవరూ కూడా స్పందించవద్దని, సంయమనం పాటించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కోరారు. ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో జరిగిలే అందరం కూడా కలిసి పనిచేయాలని, గెలుపోటములు ప్రజల చేతుల్లో ఉన్నాయన్నారు. గద్వాలలో ముఠా గ్యాంగులు అరాచకాలు సృష్టించి బెదింరించాలని యత్నిస్తే అలాంటి నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హితవు పలికారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 18, 19 తేదీల్లో నిర్వహించే విపత్తు నిర్వహణలో మానసిక చేయూత అందించడంలో సోషల్ వర్క్ పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ, కన్వీనర్ దేవరాజ్, హెచ్ఓడీ పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

మీ బిడ్డగా ఆశీర్వదించండి

- ఈ మట్టిలోనే పుట్టిన.. చస్తే ఈ మట్టిలోనే కలుస్తా
- పాలమూరులో 14 సీట్లు గెలిపిస్తే రాష్ట్రంలో 100 సీట్లు తెచ్చే బాధ్యత నాదే..
- కాంగ్రెస్ వచ్చిన వెంటనే పాలమూరు ఎత్తిపోతలు పూర్తి
- నాగర్‌కర్నూల్, అచ్చంపేట, వనపర్తి బహిరంగ సభల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



వనపర్తిలో విజయభేరి సభకు హాజరైన ప్రజలు

వనపర్తి/నాగర్‌కర్నూల్/అచ్చంపేట: 'ఈ మట్టిలోనే పుట్టిన.. చస్తే ఈ మట్టిలోనే కలుస్తా.. మీ ప్రాంత బిడ్డగా నాకు ఒక అవకాశం వచ్చింది.. నన్ను ఆశీర్వదించాలని' టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉమ్మడి పాలమూరులోని నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి, అచ్చంపేట, వనపర్తిలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ఎవరు సీఎం అయినా మన వలసలను అడ్డం పెట్టుకుని రూ.కోట్లు తెచ్చుకుని వారి ప్రాంతాలను అభివృద్ధి చేసుకున్నారన్నారు. మా బతుకులు బాగుపడతాయని 2009లో కేసీఆర్‌ను మన భుజాలపై మోసి ఎంపీని చేస్తే పాలమూరును పట్టించుకోలేదన్నారు. మా పాలమూరు బిడ్డల మర్యాదను చేతకాని తనంగా తీసుకుంటే ఎవరినీ వదలం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు ఎత్తిపోతలు పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి ఎంత సన్నిహితంగా ఉన్నారో.. నా కుటుంబంతోనూ అంతే సన్నిహితం ఉందన్నారు. కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఎవరికి మద్దతు ఇస్తే వారు ఎమ్మెల్యేగా గెలిచారని, ఇప్పుడు ఆయన కుమారుడు రాజేష్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా నిలిచాడని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 ఎమ్మెల్యే సీట్లు గెలిపిస్తే రాష్ట్రంలో వంద సీట్లు తెచ్చే బాధ్యత తనదన్నారు.

2009లో పారిపోయి వస్తే..

తెలంగాణ రాష్ట్ర సాధనలో 2009 పార్లమెంట్ ఎన్నికల్లో కరీనంగర్ ప్రజలు ఓడగొడతారని పారిపోయి పాలమూరుకు వస్తే.. ఎంపీగా కేసీఆర్‌ను గెలిపించి.. తెలంగాణ రాష్ట్రం సాధిస్తే ఈ పాలమూరుకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్రం సిద్ధించి పదేళ్లు గడిచినా మన కలలు నెరవేరలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వంశీకృష్ణ 50 వేల మెజార్టీతో గెలవబోతున్నారని, హెలీకాప్టర్‌లో నుంచి మిమ్మల్ని చూసినప్పుడే నాకు సంపూర్ణ విశ్వాసం కలిగిందన్నారు.



వనపర్తిలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

ఊళ్లమీద పడి ఊడ్చుకు తిన్నారు

బీఆర్ఎస్ నాయకులు మిడతల దండులా ఊళ్ల మీద పడి తెలంగాణ సంపదను ఊడ్చుకుతున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ తెచ్చామని చెప్పుకున్న బీఆర్ఎస్‌కు పదేళ్లు అవకాశం ఇస్తే.. ప్రతి పనిలో కమీషన్లు దండుకుని వంద ఎకరాల్లో ఫాంహౌస్‌లు, రూ.కోట్లు సంపాదించుకున్నారని, అలాంటి వారికి మరోసారి అవకాశం ఇవ్వొద్దని కోరారు. పదేళ్ల పాలనలో నష్టపోయింది చాలు అని.. ఇక మన పాలన మనమే చేసుకుందామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా మేఘారెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్‌వి తప్పుడు లెక్కలు

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఉద్యోగ నియామకాల విషయంలో తప్పుడు లెక్కలు చెబుతున్నారన్నారు. కేసీఆర్ నిరుద్యోగుల ఉసురు పోసుకుని, ఇప్పుడు మేమొస్తే అన్నీ సక్కగ చేస్తామని చెబుతున్నారని, అలాంటి మాయమాటలు నమ్మవద్దన్నారు. మళ్లీ కుర్చీపై కూసునే అర్హత కేసీఆర్‌కు లేదని, అందుకే కాంగ్రెస్‌కు జనసమితి మద్దతు పలుకుతుందని చెప్పారు.

- వనపర్తి నియోజకవర్గంలో ఆలయాల భూములు కాపాడుకోవాలంటే ఈసారి కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని వనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి మేఘారెడ్డి కోరారు.
- 40 ఏళ్లుగా ఎలాంటి మచ్చలేకుండా ఈ ప్రాంతానికి సేవ చేస్తున్నానని, ఇప్పుడు నా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా.. అందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కోరారు.
- నా తండ్రి ఎలాంటి అవినీతికి పాల్పడకుండా సేవ చేశారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ఎలాంటి అవినీతికి పాల్పడకుండా సేవచేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. తనను ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించి సేవచేసే భాగ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.
- ఆయా సభల్లో ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి, కర్ణాటక విద్యాశాఖ సుధాకర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ మల్లురవి, మాజీ ఎంపీ మందా జగన్నాథం, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట అభ్యర్థి వంశీకృష్ణ, కొల్లాపూర్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పీవీ మోహన్, వనపర్తి డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, డాక్టర్ అనురాధ, కేవీఎన్ రెడ్డి, బాలాజీసింగ్, నాగర్‌కర్నూల్ సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ, వనపర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు


మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: జిల్లాలో జరిగే శాసనసభ ఎన్నికలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 71,419ఓటర్ల గుర్తింపు కార్డులున్నాయని, మరో 5700 ఓటరు గుర్తింపు కార్డులు రావాల్సి ఉందన్నారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో పలుదఫాలుగా ఎన్నికల నిర్వహణ, బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. అలాగే, ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు సంబంధించి కేటాయింపు ప్రక్రియ, పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పించామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, చీర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రాస్‌కంట్రీ పోటీలకు ఎంపికలు


క్రాస్ కంట్రీ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో క్రాస్‌కంట్రీ ఆలిండియా సౌత్‌జోన్ పోటీలకు స్త్రీ, పురుష జట్ల ఎంపికలు నిర్వహించారు. పోటీల్లో పలు కళాశాలల విద్యార్థులు పాల్గొనగా స్త్రీలు, పురుషులలో ఆరుగురు చొప్పున ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన వారు ఎస్ఆర్ఎంటీ నాదేడ్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పీడీ సత్యభాస్కర్‌రెడ్డి, అథ్లెట్ కోచ్ సునీల్, కవిత, గాలెన్న, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యార్థులు..

గద్వాల అర్బన్: సౌత్‌జోన్ అంతర్ రాష్ట్ర విశ్వవిద్యాలయం, ఆల్‌ఇండియా టోర్నమెంట్‌లో భాగంగా పాలమూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రాస్ కంట్రీ పోటీలకు జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం సెకండియర్ చదువుతున్న జయలక్ష్మి, బీఏ హెచ్ఈపీ సెకండియర్ చదువుతున్న అశోక్ ఎంపికయ్యారు. వీరు త్వరలో నాందేడ్‌లో జరగబోయే క్రాస్‌కంట్రీ 10కిలోమీటర్ల టోర్నమెంట్‌లో పీయూ తరఫున పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ అభినందించి మాట్లాడారు. క్రాస్‌కంటీ పోటీల్లో ప్రతిభ చాటి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వార్షిక పరీక్షలు


స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో పదో బ్యాచ్‌లో వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందిన 11వ బ్యాచ్ 196 మంది అభ్యర్థులకు హైదరాబాద్ సెట్విన్ ఆధ్వర్యంలో మంగళవారం వార్షిక పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు థియరీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగాయి. పరీక్షలను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, ఇతర అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ మాట్లాడుతూ 11వ బ్యాచ్ విద్యార్థులకు ఆగస్టు 10 నుంచి నవంబర్ 10 వరకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందారని, ఉత్తీర్ణులైన వారికి సెట్విన్‌చే సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కేంద్రంలో శిక్షణ పొందిన అభ్యర్థులకు త్వరలో జాబ్‌మేళా నిర్వహించి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగం అవకాశం కల్పించేలా చూస్తామన్నారు. 12వ బ్యాచ్ శిక్షణను ఈ నెల 25 నుంచి ప్రారంభిస్తామని, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్ సెల్ నం.94415 65895ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెట్విన్ కోఆర్డినేటర్, పరీక్షల పరిశీలకుడు సత్యనారాయణరెడ్డి, ఎగ్జామినర్లు సుజన, మాధవి, ఇస్మాయిల్, జిల్లా యువజన, క్రీడలశాఖ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, కేంద్రం ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలమూరులో సీఎం కేసీఆర్ సభ
మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సభకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం సభ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సభతో ఉమ్మడి జిల్లాలో సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార పర్యటనలు పూర్తి కానున్నాయి.

ఎన్నికల సిత్రాలు..

ఓవైపు ఆశీర్వాదం .. మరోవైపు ప్రచారం



మహబూబ్‌నగర్ మండలం చౌదర్‌పల్లిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నూతన వధూవరులను ఆశీర్వదించి, పార్టీ మేనిఫెస్టో బ్రోచర్‌ను అందజేశారు. - మహబూబ్‌నగర్ రూరల్

పువ్వు సంకేతం.. విజయం ఖాయం!



దామరగిద్ద మండలం బాపన్‌పల్లి గజలేశ్వరిమాతను నారాయణపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి దర్శించుకొని కొబ్బరికాయ కొట్టగా.. పువ్వు రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. - నారాయణపేట

రామక్క పాట జోరు..



గద్వాల మండలం జిల్లెడబండ గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రామక్క పాటకు స్టెప్పులేసి సందడి చేశారు. - గద్వాల అర్బన్

అందరితో కలిసి.. పిడికిలెత్తి..



అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి తండాలో దేవరకద్ర బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందరితో కలిసి పిడికిలెత్తి జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. - అడ్డాకుల

నెత్తికెక్కిన అభిమానం



ఊట్కూరు మండలం వర్కూరులో మక్తల్ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పూలమొక్కలతో స్వాగతం పలుకడం అందరినీ ఆకట్టుకుంది. - మక్తల్

ఏక్ బార్ చాన్స్ దేవో!



మై చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డికా బేటిహు.. కాంగ్రెస్ పార్టీకి ఓట్ దాల్‌ఖో ఏక్ బార్ చాన్స్ దేవో అంటూ నారాయణపేటలో కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి ఇంటింటా ప్రచారం చేశారు. - నారాయణపేట

పంచ అస్త్రాలకే ప్రాధాన్యం

- మద్యం, డబ్బు, అంగబలం, వాగ్దానం, ఫిరాయింపులు
- వీటినే నమ్ముకున్న నాయకులు
- అన్ని పార్టీలదీ అదే తీరు



అచ్చంపేట: ఎన్నికల్లో గెలుపొంది ప్రజాప్రతినిధిగా పేరు పొందాలని అనుకోని రాజకీయ నాయకుడు ఉండడంటే అతిశయోక్తి కాదు. అందుకోసం ఎవరికి వారు ప్రయత్నాలు చేయడం పరిపాటి. ప్రస్తుత ఎన్నికల్లో తమదే పైచేయి కావాలనే తలంపుతో కొందరు అభ్యర్థులు పంచాస్త్రాలను సంధిస్తున్నారు. ప్రధానంగా డబ్బు, మద్యం, అంగబలం, వాగ్దానం, ఫిరాయింపులను నమ్ముకుంటున్నారు. ప్రతి ఎన్నికల్లో ఇవి రాజకీయాలను శాసిస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఇవి రాజకీయ పార్టీల చేతుల్లో కీలుబొమ్మలుగా మారాయి. ఓటర్లను నాయకులు అనేక రకాలుగా మభ్యపెట్టి, ప్రలోభపెట్టి, మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు. ఈ పంచాస్త్రాలను పావులుగా వాడుకున్నవారే రాజకీయాల్లో నెగ్గగలడు అనే స్థాయిలో నేటి రాజకీయాలు ఉన్నాయి.

డబ్బు: డబ్బుకు ఓటరు దాసోహం అన్నట్లుగా నోటు ఇచ్చి ఓటు వేయించుకునే పరిస్థితి సర్వత్రా కనిపిస్తోంది. మనిషికి పంచభూతాల్లో భూమి ఎంత అవసరమో రాజకీయాల్లో డబ్బుకు అంత ప్రాధాన్యం ఉంది. కోట్లను మంచినీళ్లలా ఖర్చు చేస్తూ ఎన్నికల్లో గెలువడానికి యత్నిస్తున్నారు. అధికారం కోసం ఎంత ఖర్చయినా పెట్టడానికి వెనకాడటంలేదు.

మద్యం: పంచభూతాల్లో నీరు ఎంత ముఖ్యమో రాజకీయాస్త్రాల్లో మద్యానికి అంతకుమించి ప్రాధాన్యం ఉంది.పోటీల్లో ఉన్న అభ్యర్థులు ప్రచారంతో ఆరంభించి, విజేతలయ్యే వరకు మద్యాన్ని ఏరులా పారించడం పరిపాటిగా మారింది. ఓటరుకు మద్యం బాటిల్స్ ఇచ్చి ఓటు వేయించుకునే పరిస్థితులే ఎక్కువగా ఉన్నాయి.

అంగబలం: బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్లుగా రాజకీయ నాయకులకు అంగబలం లేకపోతే అన్ని చచ్చుబడినట్టే. అందుకే తమ చుట్టూ 10మంది ఉండేలా ప్రైవేటు సైన్యాన్ని పెంచి పోషిస్తుంటారు నాయకులు. టికెట్ వస్తే ప్రచారానికి, రాకపోతే దిష్టి బొమ్మలు తగలబెట్టడానికి ఉపయోగపడ్తారు. లేదంటే ఎదుటి వ్యక్తులపై విమర్శలు చేస్తారు. మొత్తమ్మీద లీడర్‌కు అంగుబలం ప్రాణవాయువుతో సమానం.

వాగ్దానం: అరచేతిలో స్వర్గాన్ని చూపిస్తూ ఓటర్లను ప్రలోభపెట్టడంలో మన నాయకులు ఆరితేరారు. అధికారం చేజిక్కిన తర్వాత మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు కనిపించకుండాపోవడం ఈ వాగ్దానభూత రాజకీయ లక్షణం. పక్కా ఇళ్లు, స్థలాలు, ఉచిత బీమా ఇతర ఉచిత పథకాలపై అనేక వాగ్దానాలు చేస్తూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఈ అస్త్రం నాయకులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఫిరాయింపులు: ఈ అస్త్రంతో ఏ నాయకుడు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియకుండా పోతోంది. రాజకీయాల్లో ఈ అస్త్రానికి ప్రత్యేక స్థానం. గోడమీది పిల్లిలా, తక్కెడలోని కప్పలాంటి లక్షణాలతో టికెట్ రాకపోయినా, సరైన ప్రాధాన్యం దక్కకపోయినా లేదా తమ స్వప్రయోజనాల కోసమో నాయకులు ఈ అస్త్రాన్ని ఎక్కువగా వాడతారు.



విజయం వరించిందని విర్రవీగకు. ఓటమి ఎదురైందని నిరాశ చెందకు. విజయం అంతం కాదు.. ఓటమి తుదిమెట్టు కాదు.
- స్వామి వివేకానంద

దుమ్ము లేపుతున్న రామక్క పాట



అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పార్టీల ప్రచారం వేడెక్కుతోంది. ఈ క్రమంలో అందరి దృష్టిని ఓ పాట ఆకర్షిస్తోంది. అన్ని పార్టీల వారికి అదే పాట అక్కరకొస్తోంది. పాట పల్లవి మాత్రం ఒక్కటి. అందులో ఉన్న పదాలు మాత్రం ఆయా పార్టీలకు చెందినవిగా ఉంటాయి. నడువు నడువు నడవవే రామక్క.. కలిసి నడుము కట్టవే రామక్క అంటూ హోరెత్తుతున్న ఈ పాటను మొదట బీఆర్‌ఎస్ రూపొందించగా, జనంలో బాగా కనెక్ట్ అయింది. అయితే అదే పల్లవి, బాణీతో కాంగ్రెస్, బీజేపీలు ఆ చరణాలను మార్చి, తమ పార్టీలకు అనుగుణంగా పదాలను కూర్చి సరికొత్తగా పాటలను రూపొందించాయి. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో పార్టీల వారీగా దరువులు కొనసాగుతుండగా.. ఇక రామక్క పాట వీధి వీధిలో మార్మోగుతోంది. కొందరు గాయకులు అన్ని పార్టీలకు తమ గాత్రాన్ని అందిస్తుండటంతో పాటను జాగ్రత్తగా వింటే గానీ.. ఏ పార్టీకి చెందినదో తేల్చుకోలేకపోతున్నారు. - జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)

జంగ్ తెలంగాణ

సంగం బండ!

నిర్వాసితుల గోస పట్టని ప్రభుత్వం

- పునరావాస కేంద్రాల్లో ముందుకు సాగని పనులు
- అసంపూర్తిగా లోలెవల్ కాల్వ నిర్మాణం
- 10వేల ఎకరాలకు సాగునీళ్లు అందని వైనం
- ఏళ్ల తరబడి నిర్వాసితులు, రైతుల అవస్థలు
- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్టులో పలు విషయాలు వెలుగులోకి..



సంగంబండ పునరావాస కేంద్రం

గ్రౌండ్ రిపోర్ట్

మక్తల్: సంగంబండ రిజర్వాయర్ నిర్వాసితులు, ఆయకట్టు రైతుల గోస ఎవరికీ పట్టడం లేదు. రిజర్వాయర్‌తో ఒకవైపు సాగునీళ్లు అందకపోవడం, మరోవైపు నిర్వాసితుల సమస్యలు తీరకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో 15ఏళ్ల కిందట సంగంబండ రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్ లోలెవల్ ఎడమ కాల్వ నిర్మాణ పనులను రూ.4కోట్లతో చేపట్టగా.. పనులు ముందుకు సాగడంలేదు. దీంతో మక్తల్, మాగనూర్ మండలాల్లోని వడ్వాట్, అమ్మపల్లి, పర్మాన్‌దొడ్డి, ఓబ్లాపూర్, సంగంబండ, చందాపూర్, గుర్లపల్లి, తిర్మలాపూర్, దాసర్‌దొడ్డి, వనాయికుంట గ్రామాల్లోని 10వేల ఎకరాలకు సాగునీరు అందడంలేదు. సంగంబండ సమీపంలో లోలెవల్ ఎడమ కాల్వ నిర్మాణానికి బండరాయి అడ్డు రావడంతో పనులకు ఆటంకం ఏర్పడింది.

చాలీచాలని పరిహారం..

సంగంబండ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు చాలీచాలని పరిహారం అందజేశారు. రిజర్వాయర్ నిర్మాణానికి 1995లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయగా.. 2003లో భూసేకరణకు చర్యలు చేపట్టారు. సంగంబండ గ్రామంలో 300మంది రైతుల నుంచి దాదాపు 800 ఎకరాల భూమి సేకరించగా.. సుమారు రూ.3కోట్ల పరిహారం చెల్లించారు. మాగనూర్ మండలంలోని ఉజ్జెల్లిలో 350మంది రైతులు 880 ఎకరాల భూమి కోల్పోగా.. రూ.4కోట్లకు పైగా పరిహారం చెల్లించారు. రిజర్వాయర్ నిర్మాణంలో కోల్పోయిన భూములకు అంతంతమాత్రంగా పరిహారం అందజేయడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పునరావాస కేంద్రాల్లో ఇదీ పరిస్థితి..

మక్తల్ మండలం సంగబండ గ్రామ సమీపంలో 66 ఎకరాల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయగా.. అధికారులు సర్వే నిర్వహించి 740మంది నిర్వాసితులను ఎంపిక చేశారు. అందులో కేవలం 30మందికి మాత్రమే ఐఏవై కింద ఇళ్ల బిల్లులు చెల్లించారు. నిర్వాసితులకు ఉపాధి హామీ పథకంలో రూ.13కోట్లు కేటాయించగా.. నేటికీ డబ్బులు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా ఆర్అండ్ఆర్‌లో 60మందికి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వలేదు. 500మందికి ఇళ్ల బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- మాగనూర్ మండలం ఉజ్జెల్లి నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకుగాను 88 ఎకరాలు కేటాయించారు. మొత్తం 929 ఇంటి స్థలాలు ఇవ్వగా.. 465మంది ఇంటి నిర్మాణం చేపట్టారు. మరో 464మంది ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. మిగతా 170మంది దరఖాస్తు చేసుకోగా.. ప్లాట్లు కేటాయించకపోవడంతో అవస్థలు పడుతున్నారు.
- ఊట్కూర్ మండలం కొత్తగార్లపల్లిలో ఆర్అండ్ఆర్ కేంద్రం ఏర్పాటు చేయగా.. 240 మందికి ఇంటి స్థలాలు కేటాయించారు. అందులో 180మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దాదాపు 60మందికి బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అసంపూర్తిగా నిలిచిన సంగంబండ లోలెవల్ కాల్వ

నిర్వాసితుల అవస్థలు..

రిజర్వాయర్‌లో సంగంబండ, ఉజ్జెల్లి, గార్లపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. రిజర్వాయర్‌తో సర్వం కోల్పోయిన బాధితులను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికీ పునరావాస కేంద్రాల్లో సరైన వసతులు కల్పించకపోవడం, బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఇంటి నిర్మాణాలు ముందుకు సాగడంలేదు. ఉజ్జెల్లికి రూ.13,34,59,200, సంగంబండకు రూ.11.98కోట్లు, గార్లపల్లికి రూ.1,00,19,400 మంజూరు చేయగా.. పనుల్లో పురోగతి కనిపించడంలేదు. కొందరు నిర్వాసితులు ముంపునకు గురైన గ్రామాల్లోని పాడుబడిన ఇళ్లలో నివాసముంటూ కాలం వెల్లదీస్తున్నారు. కాగా, కొత్తగార్లపల్లి గ్రామం కూడా ముంపునకు గురికాగా.. ప్రభుత్వం జీఓలతో సరిపెడుతోంది.



గార్లపల్లి ఆర్అండ్ఆర్‌లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు

ఎవరూ పట్టించుకోవడంలేదు..



సంగంబండ రిజర్వాయర్ నిర్వాసితులను ఎవరూ పట్టించుకోవడంలేదు. అధికారు నిర్లక్ష్యంతో పునరావాస కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పునరావాస కేంద్రం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. సంగంబండలో ఇంకా 60మంది నిర్వాసితులకు ఇంటి స్థలాలు ఇవ్వాల్సి ఉంది.
- తిమ్మప్ప, ఎంపీటీసీ, సంగంబండ

ఇంటి బిల్లు రాలేదు..



రిజర్వాయర్‌లో ఇల్లు, భూములను కోల్పోయాం. ప్రభుత్వం కేటాయించిన ఆర్అండ్ఆర్‌లో ఇంటి నిర్మాణం ప్రారంభించి నాలుగేళ్లు అవుతుంది. బిల్లులు రాకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. అధికారులను అడిగినా ఫలితం లేకుండాపోతుంది.
- కనకరాజు, ఉజ్జెల్లి, మాగనూర్ మండలం

కాల్వ పనులను పూర్తి చేయాలి..



సంగబండ రిజర్వాయర్ ఎడమ లోలెవల్ కాల్వ పనులు చేసి రైతులకు సాగునీరు అందించాలి. రిజర్వాయర్ నుంచి సాగునీళ్లు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి కాల్వ పనుల పూర్తికి చర్యలు చేపట్టాలి.
- రవీందర్, వడ్వాట్, మాగనూర్ మండలం

నిర్వాసితులకు న్యాయం చేయాలి..



సంగంబండ రిజర్వాయర్‌లో సర్వం కోల్పోయిన వారికి న్యాయం చేయాలి. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి. రిజర్వాయర్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీళ్లు అందేలా చూడాలి.
- రామాంజనేయులు, మక్తల్

ఓటు భద్రం

- అక్రమ ఓటింగ్‌ను అడ్డుకునేందుకు 'చాలెంజ్ ఓటు'
- ఓటు గల్లంతైతే 'టెండర్ ఓటు'కు అవకాశం
- ఎన్నికల కమిషన్ వెసులుబాటు



జడ్చర్ల టౌన్: ఏ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌లో అయినా పోలింగ్ బూత్‌కు వెళ్లడం.. ఓటర్ స్లిప్, గుర్తింపు కార్డు చూపడం.. ఓటు వేయడం అంతే. కానీ, ఓటు వేయడంలోనూ చాలెంజ్, టెండరు ఓటు అనేవి ఉంటాయి. చాలెంజ్ ఓటు అంటే.. ఎవరైనా ఓటరు తన ఓటును ముందే వేశారని గుర్తిస్తే అలాంటి సమయంలో ఎన్నికల కమిషన్ టెండరు ఓటుకు అవకాశం కల్పించింది.

చాలెంజ్ ఓటు

పోలింగ్ కేంద్రంలో అధికారులతో పాటు ఆయా పార్టీలు నియమించుకున్న పోలింగ్ ఏజెంట్లు ఉంటారు. ఒక ఓటరు ఓటు వేయటానికి వచ్చినపుడు సదరు ఓటరు నకిలీ అని ఏజెంట్ సందేహించినపుడు పోలింగ్ ఏజెంట్ చాలెంజ్ చేయటానికి వీలు కల్పించారు. ఓటరు సరైన వ్యక్తి కాదని ప్రిసైడింగ్ అధికారితో చాలెంజ్ చేసి రూ.5 రుసుం చెల్లించి సదరు ఓటును చాలెంజ్ చేస్తాడు. దాంతో ప్రిసైడింగ్ అధికారి ఓటరుకు సంబంధించిన పత్రాలు అన్ని పరిశీలించి నిర్ధారణ చేసుకుని సరైన ఓటరుగా నిరూపణ అయితే ఓటు వేయటానికి అవకాశం కల్పిస్తాడు. లేదంటే వెనక్కి పంపిస్తారు. కొన్ని సందర్భాల్లో ఓటరుకు బ్యాలెట్ అందించి దానిద్వారా ఓటు వేయించి కవర్‌లో ఉంచి సీల్ చేస్తారు. ఓటరు సక్రమం అని తేలితే కౌంటింగ్ సమయంలో కవర్ ఓపెన్ చేసి దానిని లెక్కించటం జరుగుతుంది.

టెండరు ఓటు

పోలింగ్ రోజున ఓటరు తన ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి చేరుకున్నప్పటికి అప్పటికే మరెవరో తన ఓటు వేశారని గుర్తిస్తే టెండరు ఓటు వేస్తానని అధికారులను కోరవచ్చు. తన స్థానంలో ఇంకెవరో ఓటు వేశారని ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి. అప్పుడు ఆ అధికారి విచారణ జరిపి గుర్తింపును నిర్ధారిస్తారు. అయినప్పటికి ఓటు వేయటానికి అవకాశం కల్పించకుండా ఉంటే టెండరు ఓటు వేస్తానని ఓటరు డిమాండ్ చేయవచ్చు. రూ.2 రుసుము చెల్లించి టెండరు ఓటు వేసుకోవచ్చు. టెండరు ఓటు సైతం బ్యాలెట్ ద్వారానే వేసుకోవాల్సి ఉంటుంది. ఓటరు వేసిన టెండరు ఓటును సీల్డ్ కవర్‌లో ఉంచుతారు. ఇలా చాలెంజ్, టెండరు ఓట్లను ఓటరు వినియోగించుచుకునే వెసులుబాటు ఎన్నికల కమిషన్ కల్పించింది. కాగా ఎన్నికల్లో చాలెంజ్, టెండరు ఓట్లు వినియోగించుకున్న సందర్భాలు మన ప్రాంతంలో లేవనే చెప్పాలి.

అవినీతి పాలకులను ఓడించండి

జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఆకునూరి మురళి



నారాయణపేటలో మాట్లాడుతున్న మురళి

నారాయణపేట/దేవరకద్ర: అవినీతి పాలకులను ఎన్నికల్లో ఓడించాలని జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఆకునూరి మురళి కోరారు. అవినీతి, అహంకార బీఆర్‌ఎస్, మతోన్మాద ఫాసిస్టు బీజేపీ, ఎంఐఎంలను ఓడించాలని కోరుతూ చేపట్టిన జాగో (మేలుకో) తెలంగాణ బస్‌యాత్ర మంగళవారం నారాయణపేట, దేవరకద్ర పట్టణాలకుచేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం నాశనం అయిందని, నిరుపేదలకు కనీసం ఇల్లు, ఇంటి స్థలాలు ఇవ్వలేదని, కార్మికులను కనీస వేతనాలు అమలు చేయకుండా అహంకార పాలన సాగిస్తుందని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నల్లధనం వెలికితీస్తామని, ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని, ఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మొండిచేయి చూపించారని ఆరోపించారు. బడా కార్పొరేట్ కంపెనీలకు రూ.16లక్షల కోట్ల రుణ మాఫీ చేసిందన్నారు. మోదీ, కేసీఆర్ సర్కార్లను ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, జాగో రాష్ట్ర నాయకులు వినాయకారెడ్డి, పద్మజ, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర నాయకుడు హన్మేష్, రాము, కాశీనాథ్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, జయ, సునీత, గోవర్ధన్, శంకర్, ఇఫ్టూ నాయకులు సాంబశివుడు, వెంకటేష్, పద్మ, కల్పన, ఎం.కృష్ణ, బి.రాము, యాదగిరి, కాశీనాథ్, రాము, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బర్రెలక్క తమ్ముడిపై దాడి

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి శిరీష

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్‌లో బర్రెలక్క అలియాస్ శిరీష స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. మంగళవారం కోడేరులో ప్రచారం ముగించుకుని వెన్నచర్ల గ్రామానికి వెళ్లగా.. గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు శిరీష తమ్ముడు భరత్‌కుమార్‌పై దాడికి యత్నించారు. విషయాన్ని గమనించిన శిరీష తన మద్దతుదారులతో కలిసి పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. తన తమ్ముడిపై దాడి చేసిన వారిని శిక్షించాలని, తనకు పోలీస్ సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్ఐ రాజు శిరీషతో మాట్లాడి శాంతింపజేశారు. దాడి చేసిన వారిపై ఫిర్యాదు తీసుకుని సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీస్ సెక్యూరిటీ విషయంలో జిల్లా ఎస్పీతో మాట్లాడుతామని చెప్పారు.


ముమ్మరంగా వాహనాల తనిఖీ

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం లాల్‌కోట చౌరస్తాలోని రాయచూరు–హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్లకు చెందిన గడ్డం యాదిరెడ్డి ఎలాంటి పత్రాలు లేకుండా రూ.2.50 లక్షలు తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తరలించవద్దని సూచించారు.

హైకోర్టు తీర్పును రద్దు చేయండి

చంద్రబాబుకు బెయిల్ విషయంలో పరిధి దాటింది ● రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ దాఖలు

- సుప్రీంకోర్టు నిర్దేశించిన కొలమానాలను హైకోర్టు అతిక్రమించింది
- కేసు లోతుల్లోకి వెళ్లి క్లీన్‌చిట్ ఇచ్చే ప్రయత్నం చేసింది
- ట్రయల్ కోర్టును ప్రభావితం చేసేలా ఆ తీర్పు ఉంది
- మినీ ట్రయల్ నిర్వహణ.. 39 పేజీల తీర్పే ఇందుకు నిదర్శనం
- దుర్వినియోగం చేసిన నిధులు టీడీపీ ఖాతాల్లోకి వెళ్లాయి
- అందుకు పూర్తి ఆధారాలున్నా ఏమాత్రం పట్టించుకోలేదు
- చంద్రబాబుకు రాజకీయ పలుకుబడి ఉంది.. సాక్షులను బెదిరించడం ద్వారా దర్యాప్తును ప్రభావితం చేస్తారు
- హైకోర్టు తేల్చిన అంశాలు వాస్తవ విరుద్ధం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో నిందితుడైన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పూర్తి స్థాయి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పును రద్దు చేయాలని కోరుతూ మంగళవారం స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. ఇందులో నారా చంద్రబాబునాయుడిని ప్రతివాదిగా చేర్చింది. ఈ ఎస్ఎల్‌పీ తేలేంత వరకు హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరింది. హైకోర్టు స్కిల్ కుంభకోణంలో సీఐడీ చేసిన ఆరోపణల పూర్వాపరాల్లోకి వెళ్లి చంద్రబాబుకు క్లీన్‌చిట్ ఇచ్చిందని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఒకవైపు కేసు లోతుల్లోకి వెళ్లడం లేదని చెబుతూ, మరో వైపు సీఐడీ ఆరోపణలు, అందుకు సమర్పించిన ఆధారాలు, ఇతర అంశాల పూర్వాపరాల్లోకి వెళ్లి హైకోర్టు తీర్పు వెలువరించిందని వివరించింది. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా కేసు లోతుల్లోకి వెళ్లకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా హైకోర్టు వ్యవహరించిందని స్పష్టం చేసింది. హైకోర్టు చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను డిశ్చార్జ్ పిటిషన్‌ను విచారించినట్లు విచారించిందని రాష్ట్ర ప్రభుత్వం ఆక్షేపించింది. 'హైకోర్టు స్కిల్ కుంభకోణం కేసు లోతుల్లోకి వెళ్లి మరీ చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేసింది. బెయిల్ మంజూరు సందర్భంగా హైకోర్టు తేల్చిన పలు అంశాలు వాస్తవ విరుద్ధం. ట్రయల్ సందర్భంగా కింది కోర్టును ప్రభావితం చేసేలా హైకోర్టు తీర్పు ఉంది. బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు ఏకంగా 39 పేజీల తీర్పు వెలువరించింది. బెయిల్ మంజూరు సందర్భంగా హైకోర్టు మినీ ట్రయల్ నిర్వహించింది. రికార్డుల్లో ఉన్న అంశాలకు విరుద్ధంగా హైకోర్టు తన నిర్ణయాన్ని వెలువరించింది. ఈ కేసులో హైకోర్టు తన పరిధిని అతిక్రమించింది' అని రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది.

సుప్రీంకోర్టు నిర్దేశించిన పరిధుల అతిక్రమణ

'ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే హైకోర్టు తీర్పు చెల్లుబాటు కాదు. దానిని రద్దు చేయాలి. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఎలా వ్యవహరించాలన్న దానిపై ఇప్పటికే స్పష్టంగా తేల్చిన న్యాయపరమైన కొలమాలన్నింటినీ హైకోర్టు తన తీర్పు ద్వారా అతిక్రమించింది. బెయిల్ పిటిషన్ల విచారణ సందర్భంగా సాక్ష్యాలను పూర్తి స్థాయిలో పరిశీలించడం, కేసు లోతుల్లోకి వెళ్లడాన్ని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో తీవ్రంగా తప్పుపట్టింది. మినీ ట్రయల్ కూడా నిర్వహించకూడదని చెప్పింది, అయితే హైకోర్టు ఏకంగా ట్రయల్ నిర్వహించింది. బెయిల్ మంజూరు సందర్భంగా సీఐడీ ఆరోపణలను, వారి తీవ్రతను, డాక్యుమెంట్ల విశ్వసనీయతను, సాక్ష్యాల విలువను హైకోర్టు తన తీర్పులో తేల్చేసింది. హైకోర్టు బెయిల్ మంజూరు సమయంలో అనుసరించాల్సిన ప్రాథమిక కొలమానాలన్నింటికి విరుద్ధంగా వ్యవహరించింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్ నమోదు చేసిన కేసు ప్రభావితం అయ్యేలా హైకోర్టు వ్యవహరించింది. దుర్వినియోగం చేసిన నిధులు తెలుగుదేశం పార్టీ ఖాతాలకు మళ్లించారని తేల్చేందుకు నిర్దిష్ట ఆధారాలు లేవని హైకోర్టు తేల్చింది. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ అంశాల జోలికి వెళ్లరాదు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న బెయిల్ పిటిషన్‌ను అడ్డంపెట్టుకుని తెలుగుదేశం పార్టీ వర్గాలు సీఐడీ దర్యాప్తునకు అడ్డుగోడలా నిలబడ్డాయి. సీఐడీ సమన్లకు ఏమాత్రం సహకరించలేదు. సీఐడీ సమన్లకు టీడీపీ వర్గాలు స్పందించలేదన్న వాస్తవాన్ని హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. మనీలాండరింగ్ అంశంపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. నిధులు ఎక్కడకు వెళ్లాయన్న దానిపై నిర్దిష్ట ఆధారాలున్నాయి. వాటిని హైకోర్టు ముందు ఉంచడం జరిగింది. అన్ని అంశాలపై ఏపీ సీఐడీ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో నిధుల మళ్లింపు జరగలేదని తేల్చడం ద్వారా హైకోర్టు ఘోర తప్పిదానికి పాల్పడింది. స్కిల్ కుంభకోణానికి సంబంధించి సీమెన్స్ కంపెనీ అంతర్గతంగా నిర్వహించిన విచారణను, దాని తాలూకు నివేదికను హైకోర్టు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. అసలు ఆ నివేదికలో ఏమీ లేదని తేల్చేసింది' అని వివరించింది.

స్పష్టంగా నగదు జాడలు

'ప్రాజెక్టు విలువ రూ.36 కోట్లు అని చంద్రబాబు తదితరులు చెబుతున్నారు. అలా అయితే గత ప్రభుత్వం రూ.370 కోట్లు ఎందుకు విడుదల చేసినట్లు? మిగిలిన రూ.280 కోట్లు దారి మళ్లినట్లే. ఎంవోయూ, జీవో ప్రకారం అందచేయాల్సిన సాంకేతికతను సీమెన్స్, డిజైన్ టెక్‌లు అందించలేదన్నది వాస్తవం. అయితే సీఐడీ ఈ అంశాన్ని లేవనెత్తలేదని హైకోర్టు తన తీర్పులో చెప్పింది. వాస్తవానికి రిమాండ్‌లోనూ, హైకోర్టు వాదనల్లోనూ ఈ అంశాన్ని లేవనెత్తాం. ఫోరెన్సిక్ ఆడిట్‌ను ప్రతికూల కోణంలో చూడటం ద్వారా హైకోర్టు తన పరిధి దాటి వ్యవహరించినట్లయింది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మొత్తం విజయవంతమైందని, దీని ద్వారా 2.13 లక్షల మంది విద్యార్థులు శిక్షణ పొందినట్లు తేల్చింది. ఇలా చెప్పడం ద్వారా హైకోర్టు తప్పు చేసింది. హైకోర్టు చెప్పింది ఎంతమాత్రం వాస్తవం కాదు. అధికారులు లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చే అధికారం చంద్రబాబుకు ఉందని హైకోర్టు తేల్చింది. ఒకవేళ అలాంటిది ఉందని అనుకున్నా, చంద్రబాబు తన, షెల్ కంపెనీల స్వీయ లబ్ధి కోసం దురుద్దేశపూర్వకంగా ఆ అధికారాన్ని ఉపయోగించారు. ఈ విషయాన్ని హైకోర్టు తన తీర్పులో పూర్తిగా విస్మరించింది. ఈ కుంభకోణానికి సంబంధించి సీమెన్స్, డిజైన్‌టెక్ ఉద్యోగులు ఇచ్చిన వాంగ్మూలాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఈ ప్రాజెక్టులో రాజకీయ జోక్యం ఉందని, ప్రాజెక్టు అమలుకు అడ్డువచ్చిన వారిని 24 గంటల్లో బదిలీ చేశారన్న వాంగ్మూలాలను పట్టించుకోలేద'ని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

క్లీన్‌చిట్ ఇచ్చే ప్రయత్నం!

'సీమెన్స్, డిజైన్‌టెక్ నుంచి రావాల్సిన 90 శాతం నిధులు రాలేదని, అందువల్ల ప్రభుత్వం చెల్లించాల్సిన 10 శాతం నిధులను చెల్లించడం సరికాదన్న అప్పటి ఆర్థిక శాఖ కార్యదర్శి అభ్యంతరాలను చంద్రబాబు పట్టించుకోని విషయాన్ని హైకోర్టు పూర్తిగా విస్మరించింది. అవినీతి నిరోధక చట్టం మౌలిక సూత్రాల నుంచి, పబ్లిక్ సర్వెంట్ అధికారం దుర్వినియోగం వంటి వాటి నుంచి హైకోర్టు దూరంగా వెళ్లింది. చంద్రబాబు సాక్షులను ప్రభావితం చేసే విషయంపై హైకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఎంతమాత్రం హేతుబద్ధమైనవి కావు. తన పీఏ పెండ్యాల శ్రీనివాస్ విదేశాలకు పారిపోవడం, కీలక నిందితులు సీఐడీ ముందుకు రాకపోవడం వంటి వాటి విషయంలో చంద్రబాబు పాత్ర ఉన్న విషయాన్ని హైకోర్టు పట్టించుకోలేదు. చంద్రబాబు రాజకీయంగా చాలా పలుకుబడి కలిగిన వ్యక్తి. దర్యాప్తును ప్రభావితం చేయడం, సాక్షులను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దర్యాప్తుకు విఘాతం కలిగేలా కొందరు నిందితులు మీడియా స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. తెలుగుదేశం పార్టీ వర్గాలు దర్యాప్తునకు సహకరించడం లేదు. చంద్రబాబుకు బెయిల్ కోసం కాకుండా క్లీన్‌చిట్ ఇచ్చే అంశంగా పరిగణించి ఆదేశాలు ఇచ్చినట్లు ఉంది. వీటన్నింటిరీత్యా చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో వివరించింది.

క్వశ్చన్ ఆఫ్ లా..

హైకోర్టు తీర్పులో పలు అంశాలపై అనుమానాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌లో పేర్కొంది. 'క్వశ్చన్ ఆఫ్ లా'కి సంబంధించి పలు ప్రశ్నలను సుప్రీంకోర్టు ఎదుట ఉంచింది. హైకోర్టు కసరత్తులో న్యాయపరమైన విధానం లోపించిందా? దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలు, నిందితుడి నేరానికి సంబంధించిన అంశాలపై హైకోర్టు వ్యాఖ్యలు న్యాయపరమైన అంశాలకు విరుద్ధంగా ఉన్నాయా? బెయిల్‌పై పిటిషనర్ల వాదనలు లేనప్పుడు హైకోర్టు విస్తృతమైన తీర్పు ఇవ్వగలదా? పీసీ చట్టం 1988 ప్రకారం అధికారిక నిర్ణయాల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని నిర్దోషిగా భావించొచ్చా? అధికారం, అధికార వినియోగం, అధికారిక పరిధి లేకపోవడం, అధికార సామర్థ్యాన్ని దుర్వినియోగం చేయడం, ఇతరులకు సొమ్ము రూపంలో లబ్ధి చేకూర్చడం తదితరాలపై హైకోర్టు నిర్ణయం సరైనదేనా?' అనే ప్రశ్నలను సుప్రీంకోర్టు ముందుంచింది. నిరంజన్‌సింగ్ వర్సెస్ ప్రభాకర్ రాజారామ్, సుమిత్ శుభాచంద్ర గంగ్వాల్ వర్సెస్ మహారాష్ట్ర కేసుల్లో తీర్పులతోపాటు స్కిల్ స్కామ్ కేసులో సాక్ష్యాధారాలను వివరించే అంశాన్ని హైకోర్టు పదేపదే తిరస్కరించిందని పేర్కొంది. సంగీతబెన్ వర్సెస్ గుజరాత్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రస్తావిస్తూ ప్రస్తుత కేసులో హైకోర్టు ఆయా అంశాలను పరిశీలించకుండా బెయిల్ కేసును మినీ ట్రయల్‌గా మార్చిందని, ట్రయల్ కోర్టు పనితీరును విస్మరించిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ ఒక్క కేసు పరిశీలనతోనే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పక్కన పెట్టవచ్చని నివేదించింది.

చంద్రబాబు ముఠాకు ఎదురుదెబ్బ

- ఫైబర్‌నెట్ కేసులో నిందితుల ఆస్తుల అటాచ్‌మెంట్
- ఏడు స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు న్యాయస్థానం అనుమతి



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులో చంద్రబాబు ముఠాకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న చంద్రబాబు సన్నిహితుల ఆస్తుల అటాచ్‌మెంట్‌కు విజయవాడ ఏసీబీ న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. సీఐడీ దాఖలు చేసిన అటాచ్‌మెంట్ పిటిషన్‌ను ఆమోదిస్తూ న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబు సహా పలువురిపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఇందులో చంద్రబాబును ఏ-25గా, ఏ-1గా వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీ, ఏ-13గా టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్ ఉన్నారు. కుంభకోణంలో నిందితుల పాత్రపై స్పష్టమైన ఆధారాలు లభించడంతో వారి ఆస్తులను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. ఏపీ, తెలంగాణలో టెరాసాఫ్ట్ కంపెనీ, తుమ్మల గోపీచంద్ తదితరుల పేరిట ఉన్న రూ.114 కోట్ల విలువైన ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలన్న సీఐడీ ప్రతిపాదనను హోం శాఖ ఆమోదించింది. దాంతో ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతి కోరుతూ సీఐడీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఇందుకు న్యాయస్థానం అనుమతినివ్వడంతో ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సీఐడీ సిద్ధమవుతోంది.

చంద్రబాబు పన్నాగమే..

టీడీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా అప్పటి సీఎం చంద్రబాబు తన సన్నిహితుడు వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి ఫైబర్‌నెట్ టెండర్లను కట్టబెట్టారు. మొత్తం రూ.3,300 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. మొదటిదశ కింద రూ.330 కోట్ల ప్రాజెక్టును టెండర్లలో ఎల్-1గా వచ్చిన బిడ్డర్‌ను కాదని మరీ టెరాసాఫ్ట్‌కు కట్టబెట్టారు. అందుకోసం బ్లాక్ లిస్టులో ఉన్న టెరాసాఫ్ట్ కంపెనీని ఆ జాబితా నుంచి తొలగించి, టెండర్లలో పాల్గొనేందుకు అనుమతించారు. ఏపీ గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్న వేమూరి హరికృష్ణను ఫైబర్‌నెట్ టెండర్ల మదింపు కమిటీలో సభ్యుడిగా నియమించారు. ఆయనకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీయే టెండర్లలో పాల్గొని, పనులు దక్కించుకుంది. ఇది పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టానికి విరుద్ధం. టెరాసాఫ్ట్ కంపెనీ పనులు కూడా నాసిరకంగా చేసి, రూ.144.53 కోట్లను దారి మళ్లించినట్టు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

అటాచ్ చేయాలని నిర్ణయించిన ఆస్తులు

- ఈ కేసులో నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు పేరిట గుంటూరులో ఉన్న 797 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఇంటి స్థలం
- కోటేశ్వరరావు డైరెక్టర్‌గా ఉన్న నెప్‌టాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు చెందిన విశాఖపట్నం కిర్లంపూడి లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్
- టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్ పేరిట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఫ్లాట్, శ్రీనగర్ కాలనీలో ఉన్న రెండు ఫ్లాట్లు, ఆయన పేరిటే యూసుఫ్‌గూడలో ఉన్న మరో ఫ్లాట్
- తుమ్మల గోపీచంద్ భార్య పవన దేవి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఉన్న వ్యవసాయ భూమి

ఇళ్లపైకి 'పచ్చ'దొంగలు.. జాగ్రత్త!

ఒకేసారి ఐదు కోట్ల మంది ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ కుట్ర.. లేని మేనిఫెస్టో పేరుతో ఇళ్లల్లోకి జొరబడుతున్న పచ్చ దొంగలు

- బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో బురిడీ
- వచ్చే ఐదేళ్లలో లక్షల్లో లబ్ధి అంటూ ప్రజలకు ప్రలోభాలు
- ఇది సైబర్ క్రైం కిందకు వస్తుంది.. ప్రజాప్రాతినిధ్య చట్టం ఉల్లంఘన కూడా..
- ఓటరు కార్డు తీసుకుని ఈసీ నిబంధనల ఉల్లంఘన, ప్రజల ప్రాథమిక హక్కులకూ భంగం
- మాయల పకీరు చేతిలో ప్రజల డేటా.. అందరూ అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల విజ్ఞప్తి



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కొత్లాబాద్‌వాసికి 11ఏళ్ల జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం/కోయిల్‌కొండ: మద్యం మత్తులో ఓ మహిళ మృతికి కారణమైన వ్యక్తికి 11ఏళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మంగళవారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి తీర్పు ఇచ్చారు. ఎస్ఐ విజయభాస్కర్ వివరాల మేరకు.. కోయిల్‌కొండ మండలం కొత్లాబాద్‌కు చెందిన వడ్డె బాలకిష్టప్ప 2020 అక్టోబర్ 4న మద్యం మత్తులో తన భార్య, తల్లితో గొడవ పడుతుండగా.. పక్కింట్లో నివాసముండే హన్మమ్మ అడ్డుగా వెళ్లింది. దీంతో క్షణికావేశానికి గురైన అతడు.. ఆమెను నెట్టివేయడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ సురేష్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహబూబ్‌నగర్ కోర్టులో పీపీ బెక్కెం జనార్దన్ సాక్షులను ప్రవేశపెట్టగా, వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో అతడికి 11ఏళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో పదేళ్లు..

గద్వాల క్రైం: హత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ మంగళవారం జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.కుషా తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు. ఎస్పీ వివరాల మేరకు.. గద్వాల మండలంలోని శెట్టి ఆత్మకూర్‌కు చెందిన హరిజన రాజు అదే గ్రామానికి చెందిన వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంపై ఆమె భర్త ఆంజనేయులు రాజును మందలించాడు. అయినప్పటికీ ఎలాంటి మార్పు లేకపోవడంతో 2017 ఫిబ్రవరి 9న వారిద్దరు ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో ఆంజనేయులపై రాజు గొడ్డలితో దాడి చేయడంతో తీవ్ర రక్తగాయాలు కాగా.. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన సిబ్బంది, పీపీలను ఎస్పీ అభినందించారు.

కోడిపందెం స్థావరంపై పోలీసుల దాడి

ఎర్రవల్లిచౌరస్తా: రహస్యంగా కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరంపై మంగళవారం కోదండాపురం పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ కృష్ణదేవ వివరాల మేరకు.. బోరవెల్లి గ్రామశివారులో కోడిపందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో మొగిలిరావులచెర్వు గ్రామానికి చెందిన మహబూబ్ భాషాను అదుపులోకి తీసుకుని, ఓ పందెం కోడి, కోడికత్తిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమ్మోరి ప్రసాదంతో లక్ష్మీకటాక్షం

- ఆర్థిక ప్రయోజనాలు చేకూరుస్తున్న ప్రసాద విక్రయాలు
- 7 నెలల్లోనే రూ.93,50,170 ఆదాయం
- వడ ప్రసాదానికి మంచి డిమాండ్



లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్న సిబ్బంది



తయారు చేసిన లడ్డూలు

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠమైన అలంపురం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి క్షేత్రంలో విక్రయించే వివిధ రకాల ప్రసాదాలు దేవస్థానానికి లక్ష్మీకటాక్షంగా మారాయి. రోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఆలయాల దర్శనాంతరం ప్రసాదాలను కొనుగోలు చేస్తారు. ఇలా దేవస్థానం నుంచి ప్రసాదాల కొనుగోలు ద్వారా 2023-24లో కేవలం 7నెలల్లోనే రూ.93,50,170 ఆదాయం సమకూరింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిత్య ప్రసాదాల విక్రయాల ద్వారా మరే ఆలయానికి లేనంత ఆదాయాన్ని తెచ్చిపెడుతూ ఇక్కడి ప్రసాదాల ఆదాయం లక్ష్మీకటాక్షం తెచ్చిపెడుతున్నాయి.

ప్రసాదాలకు మంచి ఆదరణ..

శైవ, శక్తి క్షేత్రం, పర్యాటక ప్రాంతంగా గుర్తింపు రావడంతో నిత్యం ప్రముఖులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివస్తుంటారు. ఈ క్రమంలో ఆలయంలో లడ్డూ, పులిహోర, వడ, మహా ప్రసాదాలను తయారు చేసి భక్తులకు విక్రయిస్తుంటారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి లడ్డూ, వడ ధరలు రూ.10 నుంచి రూ.20లకు పెరిగాయి. గతంలో రిఫైండ్ ఆయిల్‌తో లడ్డూను తయారు చేయగా.. నాణ్యత, రుచిని పెంపొందించేందుకు నేతితో తయారు చేస్తూ సదరు ప్రసాదం ధర పెంచారు. కాగా ప్రసాదాల విక్రయంతో ప్రతి ఏటా రూ.కోటి దాక ఆదాయం చేకూరుతుండగా, ఈ ఏడాది రూ.కోటి 50లక్షల దాక రావొచ్చని దేవస్థానం వారు అంచనా వేస్తున్నారు. ఇక్కడ వడ ప్రసాదానికి భక్తుల నుంచి మంచి ఆదరణ ఉంటుంది. ఇలాంటి వడ మరెక్కడా దొరకదని భక్తులు బాహాటంగా చెబుతుంటారు.

అసౌకర్యాల గదిలో..

ప్రసాదాల తయారీ నుంచి దేవస్థానానికి పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నప్పటికీ.. అందుకు తగ్గ వసతులు కల్పించడం లేదు. పురాతన సత్రంలోని ఇరుకు గదుల్లో అసౌకర్యాల నడుమ ప్రసాదం తయారీ కేంద్రం కొనసాగుతోంది. రోజురోజుకూ ప్రసాదాల తయారీ పెరుగుతున్నప్పటికీ అందకు తగ్గ సిబ్బందిని పెంచడంలో మాత్రం దేవస్థానం వారు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. విశేష రోజుల్లో భక్తులకు సరిపడా ప్రసాదాన్ని అందించలేక నానా తంటాలు పడుతున్నారు.

2023లో ప్రసాదాల విక్రయాలతో సమకూరిన ఆదాయం..

నెల	లడ్డూ	పులిహోర	వడ	మహాప్రసాదం	ఆదాయం
ఏప్రిల్	27,220	20,397	8,846	1,423	రూ.10,67,590
మే	32,680	26,981	6,469	1,838	రూ.12,36,590
జూన్	33,316	27,239	8,166	1,968	రూ.12,98,830
జూలై	29,952	19,481	8,521	2,073	రూ.11,71,570
ఆగస్టు	31,099	20,611	8,686	1,871	రూ.11,88,910
సెప్టెంబర్	27,196	17,575	4,815	1,555	రూ.9,71,470
అక్టోబర్	63,871	45,391	14,424	3,954	రూ.24,15,210


శుచి, శుభ్రత పాటిస్తున్నాం..



ప్రసాదాల తయారీ కేంద్రంలో స్థల కొరత ఉన్నప్పటికీ ప్రసాదాల తయారీలో రుచి, శుచి, శుభ్రత వంటి విషయంలో అప్రమత్తంగా ఉంటున్నాం. ప్రతి ఏటా ప్రసాదాల తయారీ పెరుగుతూ వస్తోంది. విశేష రోజుల్లో అదనంగా తాత్కాలిక సిబ్బందిని తీసుకొని ప్రసాదాలను అందిస్తున్నాం. ఈ ఏడాది ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.కోటి 50లక్షల ఆదాయం రావొచ్చని భావిస్తున్నాం.

–కురుకుంద శ్రీనివాస్, ప్రసాదాల తయారీ కేంద్రం ఇన్‌చార్జ్

తయారీ కేంద్రం విషయంలో అనేక సమస్యలు..



ఆగమ సంప్రదాయం ప్రకారం ఆలయ ప్రకార మండపం లోపలి భాగంలోనే ప్రసాదాలను తయారు చేయాల్సి ఉంటుంది. ఇక్కడి ఆలయాలు పురాతత్వశాఖ పరిధిలో ఉండటం పెద్ద సమస్య అయింది. ఆలయంలో ప్రసాదాల తయారీ కేంద్రానికి తగ్గ స్థలం ఉంది. అందులో కనీసం తాత్కాలిక షెడ్డు నిర్మాణం చేద్దామన్నా సంబంధిత ఆర్కియాలజికల్ శాఖ వారు అనుమతులు ఇవ్వడంలేదు. ఇక సిబ్బంది కొరత విషయంలో క్యాడర్ స్ట్రెంత్ పెంపొందించి అదనపు సిబ్బంది నియామక అనుమతుల కోసం యత్నిస్తున్నాను. త్వరలోనే సమస్యలను అధిగమిస్తాం.

–పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

కురుమూర్తి.. భక్తఝురి

- వైభవంగా జాతర ఉత్సవాలు
- మార్మోగిన గోవింద నామస్మరణ

చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తి స్వామి జాతర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి దర్శనానికి క్యూకట్టారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. పద్మావతి ఆలయం, ఉద్దాల మండపం, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జాతర మైదానంలో దాసంగాలు పెట్టి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. మరి కొందరు భక్తులు పచ్చిపులుసు అన్నంతో నైవేద్యం, తలనీలాలు సమర్పించారు. కర్నూలు జిల్లాకు చెందిన ఓ భక్తురాలు మోకాళ్లపై స్వామి చెంతకు చేరి మొక్కులు చెల్లించుకున్నారు.

జాతర మైదానం కిటకిట

వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో జాతర మైదానం కిటకిటలాడింది. ఆటబొమ్మలు, గాజులు, తినుబండారాల దుకాణాలు రద్దీగా కనిపించాయి. జాతర మైదానంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న భక్తులు



జాతర మైదానంలో భక్తుల రద్దీ

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం



మార్కెట్‌లో ధాన్యం రాశులు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం ధాన్యం పోటెత్తింది. వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్దఎత్తున ధాన్యం అమ్మకానికి తెచ్చారు. దీంతో యార్డులోని కొత్త, పాత ఆవరణలతోపాటు షెడ్లు, సీసీరోడ్లు మొత్తం ధాన్యం కుప్పలతో నిండిపోయింది. మార్కెట్‌కు దాదాపు 12 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద వరి కోతలు ముమ్మరం కావడంతో ధాన్యం దిగుబడులు పెద్దఎత్తున వస్తుంది. దీంతో రైతులు నేరుగా మార్కెట్‌కు ధాన్యం అమ్మకానికి తేవడం వల్ల మార్కెట్ అంతా కళకళలాడుతోంది.

పీఎస్ఆర్ ధర రూ.2,881

దేవరకద్ర మార్కెట్‌లో మంగళవారం జరిగిన ఈనామ్ టెండర్లలో పీఎస్ఆర్ 5016 ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,881, కనిష్ఠంగా రూ.2,499 నమోదయ్యాయి. హంస గరిష్ఠంగా రూ.1,839, కనిష్ఠంగా రూ.1,716 ధరలు వచ్చాయి. అలాగే ఆముదాలు క్వింటాల్‌కు సరాసరిగా రూ.5,229 ఒకే ధర పలికింది.

నెట్టెంపాడుకు నిలిచిన నీటి పంపింగ్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి నెట్టెంపాడు ఎత్తిపోతలకు మంగళవారం నీటి పంపింగ్‌ను నిలిపివేసినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి 1,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆవిరి రూపంలో 111, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 724, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 300 క్యూసెక్కులతో కలిపి మొత్తం 1,865 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.933 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు చెప్పారు.